07-12-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - పాత ప్రపంచము పట్ల మమకారాన్ని వదిలి సేవ చేసే ఉత్సాహాన్ని ఉంచండి, ఉల్లాసముగా ఉండండి, సేవలో ఎప్పుడూ అలసిపోకూడదు"

ప్రశ్న:- ఏ పిల్లలకైతే జ్ఞానం యొక్క నషా ఎక్కి ఉంటుందో, వారి గుర్తులు ఏమిటి?

జవాబు:- వారికి సేవ పట్ల చాలా-చాలా అభిరుచి ఉంటుంది. వారు సదా మనసా మరియు వాచా సేవలో తత్పరులై ఉంటారు. అందరికీ తండ్రి పరిచయాన్ని ఇచ్చి ఋజువును చూపిస్తారు. రాజ్యాన్ని స్థాపన చేసేందుకు సహనం చేయాల్సి వచ్చినా సహనం చేస్తారు. తండ్రికి పూర్తి-పూర్తి సహాయకులుగా అయి భారత్ ను స్వర్గముగా తయారుచేసే సేవను చేస్తారు.

పాట:- మాతా ఓ మాతా, నీవు అందరి భాగ్యవిధాతవు... (మాతా ఓ మాతా తూ సబ్ కీ భాగ్యవిధాత...)

ఓం శాంతి. ఇప్పుడు నంబరువారు పురుషార్థానుసారంగా పిల్లలకు మాత గురించి తెలుసు. తల్లి గురించి తెలుసు అన్నప్పుడు మరి తప్పకుండా తండ్రి గురించి కూడా తెలిసి ఉంటుంది. ఈ తల్లి-తండ్రి సౌభాగ్యవిధాత మరియు భాగ్యవిధాత. ఎవరైతే పురుషార్థం చేసి తమ పూర్తి సౌభాగ్యాన్ని తయారుచేసుకుంటారో, వారినే సౌభాగ్యవిధాత అని అంటారు, వారు సూర్యవంశీ-చంద్రవంశీ కుటుంబంలో నంబరువారుగా వారసత్వాన్ని తీసుకుంటారు. ఎంతోమంది ఆటవికుల్లా ఉన్నవారు కూడా ఉన్నారు. వారు చాలా సాధారణ ప్రజలలోకి వెళ్ళి జన్మ తీసుకుంటారు. అటువంటివారు పదవిని పొందలేరు. తండ్రి తప్పకుండా అర్థం చేయిస్తారు - పిల్లలూ, ఈ పాత ప్రపంచం పట్ల మమకారాన్ని పెట్టుకోకండి. పాపము ప్రపంచమైతే ఆర్తనాదాలు చేస్తూ ఉంటుంది. పిల్లలలో సేవ చేసే అభిరుచి మరియు ఉత్సాహము ఉండాలి. కొందరికి ఉత్సాహము వస్తుంది, కానీ సేవ చేసే విధానము రాదు. డైరెక్షన్లు అయితే ఎన్నో లభిస్తాయి. వ్రాసే వివరణ కూడా చాలా రిఫైన్ గా ఉండాలి. త్రిమూర్తి మరియు వృక్షము యొక్క చిత్రాలు 30-40 అంగుళాల సైజులో ఉండాలి. ఇవి చాలా ఉపయోగకరమైన వస్తువులు. కానీ పిల్లలు వీటికి చాలా తక్కువ విలువ ఇస్తారు. సంజయునికి ఎంతో గౌరవముంది కానీ ఆ గాయనము చివరి సమయానికి సంబంధించినది. ఏ విధంగా అతీంద్రియ సుఖము గురించి గోప-గోపికలను అడగండి అని అంటారో, అలా అది కూడా చివరి అవస్థ యొక్క గాయనమే. ఇప్పుడు ఆ సుఖము ఎవరికైనా ఉందా. ఇప్పుడైతే ఏడుస్తూ, పడిపోతూ ఉంటారు. మాయ చెంపదెబ్బ వేస్తుంది. రోజు వస్తారు కానీ ఆ నషా ఏమైనా ఎక్కుతుందా. మీకు సేవా అవకాశాలు ఎన్నో లభిస్తాయి.

ఇప్పుడు - ఒకే ధర్మం ఉండాలని అంటూ ఉంటారు. భారత్ లో ఒకే గవర్నమెంట్ ఉండేది. దానినే స్వర్గము అని అనేవారు. కానీ అది ఎవరికీ తెలియదు. 5000 సంవత్సరాల క్రితం రామ రాజ్యములో (సత్య-త్రేతాయుగాలలో) ఒకే గవర్నమెంట్ ఉండేది. చప్పట్లు మ్రోగేందుకు రెండు గవర్నమెంట్లు లేనే లేవు. ఇక్కడ కూడా - హిందువులు, చైనీయులు సోదరులు అని అంటూ ఉంటారు, మళ్ళీ ఏం చేస్తూ ఉంటారో చూడండి! ఒకరినొకరు తుపాకీలతో కాల్చుకుంటూ ఉంటారు. ఈ ప్రపంచమే అలా ఉంది. స్త్రీ-పురుషులు కూడా పరస్పరం కొట్లాడుకుంటూ ఉంటారు. స్త్రీ, తన పతికి చెంపదెబ్బ వేసేందుకు కూడా వెనుకాడదు. ఇంటింటిలోనూ ఎన్నో గొడవలు ఉంటాయి. 5000 సంవత్సరాల క్రితం ఒకే గవర్నమెంట్ ఉండేదని భారతవాసులు కూడా మర్చిపోయారు. ఇప్పుడైతే అనేక గవర్నమెంట్లు, అనేక ధర్మాలు ఉన్నాయి కావున తప్పకుండా గొడవలు ఉంటాయి. భారత్ లో ఒకే గవర్నమెంట్ ఉండేదని మీరు అంటారు. దానిని భగవాన్-భగవతీల గవర్నమెంట్ అని అంటారు. భక్తి మార్గము తర్వాతనే ఉంటుంది. సత్య-త్రేతాయుగాలలో భక్తి ఉండదు. మనుష్యులు తమ అహంకారాన్ని ఎంతగానో చూపిస్తారు కానీ చిల్లిగవ్వ అంత జ్ఞానం కూడా లేదు. ఆ మాటకొస్తే వేరే విషయాలకు సంబంధించిన జ్ఞానమైతే ఉంది కదా. వైద్యానికి సంబంధించిన జ్ఞానము, బ్యారిస్టరీ జ్ఞానము... ఎవరైతే డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అని పిలవబడతారో, వారి వద్ద ఈ జ్ఞానం కొద్దిగా కూడా లేదు. ఫిలాసఫీ అని దేనిని అంటారో కూడా అర్థం చేసుకోరు. కావున పిల్లలైన మీరు సేవ చేసే అభిరుచిని ఉంచుకోవాలి, స్థాపనలో సహాయకులుగా అవ్వాలి. మంచి వస్తువులను తయారుచేసి ఇవ్వాలి. మనుష్యులు ఎలా ఉంటే, అటువంటి ఆహ్వానాన్ని ఇవ్వడం జరుగుతుంది. ఏ విధంగా గవర్నమెంట్ లో ఎంతోమంది ఆఫీసర్లు ఉన్నారు, ఎడ్యుకేషన్ మినిస్టర్ ఉన్నారు, చీఫ్ మినిస్టర్ ఉన్నారు, అదే విధంగా ఇక్కడ కూడా ఆఫీస్ ఉండాలి. ఏ డైరెక్షన్లు అయితే వెలువడుతాయో, వాటిని అమలులోకి తీసుకురావాలి. ఇప్పుడు చూడండి - గోరఖ్ పుర్ గీతలు తయారవుతాయి, వాటిని ఉచితంగా

ఇచ్చేందుకు అందరూ సిద్ధముగా ఉంటారు. ఏయే సంస్థలైతే ఉన్నాయో, వారికి ఫండ్స్ ఎంతగానో ఉన్నాయి. కాశ్మీర్ మహారాజు చనిపోయినప్పుడు మొత్తం ఆస్తి అంతా ఆర్య సమాజం వారికి లభించింది ఎందుకంటే అతను ఆర్య సమాజానికి చెందినవారు. సన్యాసులు మొదలైనవారి వద్ద కూడా ఎంతో ధనము ఉంటుంది. మీ వద్ద కూడా ధనము మొదలైనవి ఏవైతే ఉన్నాయో, వాటన్నింటినీ ఈ సేవలో వినియోగిస్తున్నారు, తద్వారా భారత్ స్వర్గముగా తయారవుతుంది. మీరు స్వర్గాన్ని తయారుచేయడంలో సహాయం చేస్తారు. రాత్రికి-పగలుకు ఉన్నంత తేడా ఉంది. వారు రోజు-రోజుకు నరకవాసులుగా అవుతూ ఉంటారు, మిమ్మల్ని ఇప్పుడు తండ్రి స్వర్గవాసులుగా తయారుచేస్తారు. వాస్తవానికి అందరూ నిరుపేదలే, మనం ధనం పోగుచేస్తామని కాదు. బాబా, ఈ పైసా-పైసా అంతా యజ్ఞములో, సేవలో వినియోగించండి అని మీరంటారు. ఈ సమయంలో అందరూ పరస్పరం కొట్లాడుకుంటూ ఉంటారు. ఒకే గవర్నమెంట్ అయితే ఉండదు. కావున గవర్నమెంట్ వారికి ఏమని తెలియపర్చాలంటే - సూర్యవంశీయులు-చంద్రవంశీయులు ఉన్నప్పుడు తప్పకుండా ఒకే గవర్నమెంట్ ఉండేది, మీరు కూడా కోరుకుంటున్నారు కదా, అది తప్పకుండా జరుగుతుంది. తండ్రి స్వర్గాన్ని స్థాపన చేస్తున్నారు. వారు హెవెన్లీ గాడ్ ఫాదర్. మనం ఒకే దైవీ గవర్నమెంట్ ను స్థాపన చేస్తున్నాము. అక్కడ అసురీ గవర్నమెంట్ ఉండదు. అవన్నీ వినాశనమైపోతాయి. మీ వద్ద జ్ఞానం చాలా బాగుంది, దానితో ఎంతో పని జరుగగలదు. ఢిల్లీ హెడ్ ఆఫీసు. వారు ఎంతో సేవ చేయవచ్చు. అక్కడ పిల్లలు కూడా చాలా బాగున్నారు. సంజయుడైన జగదీష్ కూడా ఉన్నారు. కానీ అందరూ సంజయులే కదా, ఒక్కరే కాదు. మీరు ప్రతి ఒక్కరూ సంజయులే. మీ పని - అందరికీ మార్గాన్ని తెలియపర్చడము. తండ్రి అయితే మంచి రీతిలో అర్థం చేయిస్తూ ఉంటారు, కానీ పిల్లలు తమ వ్యాపార-వ్యవహారాలలో, పిల్లలు మొదలైనవారిని సంభాళించడములోనే చిక్కుకుని ఉన్నారు. గృహస్థ వ్యవహారములో ఉంటూ తండ్రికి సహాయకులుగా అవ్వాలి, అలా చేయడం లేదు. ఇక్కడైతే సేవ చేసి చూపించాలి. ఒకే గవర్నమెంట్ ఎలా స్థాపనవుతుంది. ఈ చక్రాన్ని, డ్రామాను చూడండి, ఇది సమయాన్ని చూపిస్తుంది. ఏ విధంగా రావణుని చిత్రాన్ని తయారుచేసారో, అలా పెద్ద చక్రాన్ని తయారుచేసి ఈ విధంగా వ్రాయాలి - ఇప్పుడు ముల్లు చివరికి వచ్చి చేరుకుంది, మళ్ళీ ఒకే గవర్నమెంట్ రానున్నది. బాబా డైరెక్షన్లు ఇస్తారు. శివబాబా అయితే వీధులలోకి వెళ్ళి ఎదురుదెబ్బలు తినరు. ఒకవేళ ఇతను వెళ్ళినట్లయితే శివబాబా ఎదురుదెబ్బలు తినాల్సి ఉంటుంది. పిల్లలు గౌరవాన్ని ఉంచాలి. ఈ సేవను చేయడం పిల్లల పని. భారత్ లో ఒకే గవర్నమెంట్ ఏదైతే ఉండేదో, అది మళ్ళీ స్థాపనవుతుంది అని వ్రాయాలి. ఎన్ని సంవత్సరాల నుండి ఈ యజ్ఞము రచించబడి ఉంది! మొత్తం ప్రపంచము యొక్క చెత్త ఏదైతే ఉందో, అదంతా ఇందులో స్వాహా అయిపోనున్నది. ఇది చాలా సహజము, కానీ అందరికీ అర్థం చేయించడానికి సమయము కావాలి. రాజులైతే ఎవ్వరూ లేరు. ఎవరో ఒక వ్యక్తినైతే అందరూ నమ్మరు. పూర్వము ఏదైనా కొత్త ఇన్వెన్షన్ వెలువడితే, దానిని రాజుల ద్వారా ప్రచారం చేయించేవారు ఎందుకంటే రాజులలో శక్తి ఉంటుంది. అయితే రాజయోగం ద్వారా లేక ఎంతో ధనాన్ని దానము చేయడం ద్వారా రాజులుగా అవుతారు. ఇక్కడ ఉన్నది ప్రజల రాజ్యము. ఒకే గవర్నమెంట్ లేదు. ఒక ఫకీరు సిపాయిల గవర్నమెంటు కూడా ఉంది, ఎవరినైనా అగౌరవపర్చడములో ఆలస్యం చేయరు. ఇటువంటి పనులు ఎన్నో జరుగుతూ ఉంటాయి. కాస్త డబ్బు ఇస్తే పెద్ద మినిస్టర్ ను కూడా హతమార్చేస్తారు.

పిల్లలైన మీరు సేవా అవకాశాన్ని తీసుకోవాలి, నిద్రపోకూడదు. ఏ విధముగా సత్సంగాలలో కథలు విని మళ్ళీ ఇంటికి వెళ్ళి ఎలా ఉన్నవారు అలానే అయిపోతారు, ఎటువంటి ఉల్లాసమూ ఉండదు, అలా పిల్లలలో కూడా ఉల్లాసము తక్కువగా ఉంది. గవర్నమెంట్ వారి పుష్పాల తోటలో చాలా మంచి ఫస్ట్ క్లాస్ పుష్పాలు ఉంటాయి, ఆ డిపార్టుమెంట్ వేరుగా ఉంటుంది. ఎవరైనా వెళ్తే చాలా ఫస్ట్ క్లాస్ పుష్పాలను తీసుకొచ్చి ఇస్తారు. అలాగే ఇది తండ్రి యొక్క పుష్పాల తోట. ఎవరైనా వస్తే మనము ఏం షికారు చేయిస్తాము? వీరు మంచి-మంచి పుష్పాలు అని పేర్లు చెప్తాము. సువాసనలేని పుష్పాలు, జిల్లేడు పుష్పాలు కూడా కూర్చున్నారు, వారు ప్రకాశించరు, సేవ చేయరు. ప్రతిరోజు ఎవరో ఒకరికి తండ్రి పరిచయాన్ని తప్పకుండా ఇవ్వాలి. మీరు గుప్తమైనవారు, ఎన్ని విఘ్నాలు కలుగుతాయి. సేవా యోగ్యులుగా అవ్వలేదు. మందిరాలలోకి వెళ్ళండి, శ్మశానాలలోకి వెళ్ళండి, వెళ్ళి భాషణ చేయాలి అని బాబా పదే-పదే చెప్తారు. పిల్లలు సేవా ఋజువును ఇవ్వాలి. వందల్లో ఏ ఒక్కరో వెలువడుతారు. మిత్ర-సంబంధీకులు మొదలైనవారికి కూడా అర్థం చేయించాలి. ఇక్కడికి రావడానికి భయపడితే ఇంటికి వెళ్ళి అర్థం చేయించవచ్చు. తండ్రి పరిచయము లభించడంతో చాలా సంతోషపడతారు. సేవలో అలసట కలగకూడదు అని బాబా అంటారు. 100 మందిలో ఏ ఒక్కరో వెలువడుతారు. రాజ్యాన్ని స్థాపన చేయడములో తప్పకుండా సహనం చేయాల్సి ఉంటుంది. ఎప్పటివరకైతే నిందలు పడరో, అప్పటివరకూ కళంగీధరులుగా అవ్వరు. జ్ఞానము యొక్క నషా ఎక్కి ఉంది. కానీ రిజల్టు ఏది! అచ్ఛా, 10-20 మందికి జ్ఞానం ఇస్తే, వారి నుండి ఒకరిద్దరు మేల్కొంటే అది కూడా తెలియజేయాలి కదా. సేవా అభిరుచి ఉండాలి,

అప్పుడు బాబా బహుమతి ఇస్తారు. మీ తండ్రి ఎవరు అంటూ - తండ్రి పరిచయాన్ని ఇవ్వండి, అప్పుడే వారసత్వపు నషా కలుగుతుంది. ప్రపంచములో బ్రహ్మాకుమార-కుమారీలకు తప్ప ప్రపంచపు చరిత్ర-భౌగోళికాల గురించి ఇంకెవ్వరికీ తెలియదు అని భాషణ చేయండి, ఛాలెంజ్ చేయండి. బాబా శ్మశానము విషయాన్ని ప్రస్తావించారు కావున మీరు శ్మశానములోకి వెళ్ళి సేవ చేయాలి. వ్యాపార-వ్యవహారాలైతే 6-8 గంటలు చేస్తారు, మిగిలిన సమయం ఏమవుతుంది? అటువంటివారు ఉన్నత పదవిని పొందలేరు. బాబా అంటారు, మీరు నారాయణుడిని లేక లక్ష్మిని వరించేందుకు వచ్చారు కానీ మీ ముఖాన్ని అయితే చూసుకోండి. బాబా అయితే కరక్టుగా అర్థం చేయిస్తారు కదా. ప్రపంచ చరిత్ర-భౌగోళికాలు ఏ విధంగా రిపీట్ అవుతాయో మీరు వచ్చి అర్థం చేసుకోండి అంటూ ఒకటే టాపిక్ పై అర్థం చేయించండి. వార్తాపత్రికల్లో వేయండి. హాల్ తీసుకునేందుకు ప్రయత్నించండి. మీకు మూడడుగుల భూమి కూడా దొరకదు. మిమ్మల్ని గుర్తించనే గుర్తించరు.

మీరు పరంధామవాసులైన విదేశీయులు. ఆత్మలందరూ పరంధామము నుండి వచ్చారు కావున ఇక్కడ అందరూ విదేశీయులైనట్లే కదా. కానీ మీ భాషను ఎవ్వరూ అర్థం చేసుకోరు. కాళ్ళు పట్టుకోండి, అది-ఇది చేయండి అని ఇక్కడ సాకారములో చెప్పడం జరగదు. ఏ విధముగా సాధు-మహాత్ముల కాళ్ళను ముద్దు పెట్టుకుని వాటిని కడిగి ఆ నీటిని తాగుతారు, దానిని తత్వపూజ అని అంటారు. ఇది 5 తత్వాల శరీరము కదా. భారత్ పరిస్థితి ఎలా అయిపోయిందో చూడండి. కావున తండ్రి అంటారు, సేవా ఋజువును ఇవ్వండి, అందరికీ సుఖాన్ని ఇవ్వండి. ఇక్కడ కేవలం ఇదే ధ్యాస ఉండాలి, ఇదే చింత ఉండాలి. బుద్ధియోగము తండ్రితో ఉండాలి.

పాట - మాతా, నీవు అందరి భాగ్యవిధాతవు... జగదాంబ అయిన మాత భాగ్యవిధాత. పదవిని మాతయే పొందుతారు. ఆమె కూడా అంటారు - శివబాబాను స్మృతి చేయండి, నేను కూడా వారి ద్వారా ధారణ చేసి ఇతరులచేత ధారణ చేయిస్తాను, సౌభాగ్యాన్ని తయారుచేయిస్తాను. మీరు భారత్ యొక్క సౌభాగ్యవిధాతలు. కావున ఎంతటి నషా ఉండాలి. మమ్మా మహిమయే తండ్రిది మరియు దాదాది కూడా. పిల్లలైన మీరు యజ్ఞము యొక్క స్థూల సేవను కూడా చేయాలి, అలాగే ఆత్మిక సేవను కూడా తప్పకుండా చేయాలి. మన్మనాభవ మంత్రాన్ని అందరికీ ఇవ్వాలి. మన్మనాభవ అన్నది మనసా, మధ్యాజీభవ అన్నది వాచా, ఇందులో కర్మణా కూడా వచ్చేసింది. కన్యలు సేవలో నిమగ్నమైపోవాలి.

పల్లెలలో సేవ బాగా జరుగుతుంది. పెద్ద నగరాలలో ఎంతో ఫ్యాషన్ ఉంది. మరి ఎంతో టెంప్టేషన్ ఉన్నప్పుడు ఏం చేయాలి? పెద్ద నగరాలను వదిలేయాలా? అలా కూడా కాదు. పెద్ద నగరాల నుండి, షావుకారుల నుండి శబ్దము వెలువడుతుంది. ఇకపోతే ప్రపంచాన్ని అయితే ఈ మన్మనాభవ యొక్క గారడి మంత్రము ద్వారా స్వర్గముగా తయారుచేయాలి. ఈ జగదాంబ ఎవరు అనేది తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. ఈమె భారత్ యొక్క సౌభాగ్యవిధాత, ఈమె యొక్క శివశక్తి సైన్యము కూడా ప్రసిద్ధమైనది. జగదాంబ అందరికీ హెడ్ అనగా ఆమె భారత్ లో ఏక ప్రభుత్వాన్ని స్థాపన చేసే హెడ్. శక్తి అవతారాలైన భారత మాతలు శ్రీమతం ఆధారముగా భారత్ లో ఏక ప్రభుత్వాన్ని స్థాపన చేసారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. బుద్ధియోగము ఒక్క తండ్రితో పెట్టుకోవాలి, మన్మనాభవ అనే గారడి మంత్రము ద్వారా ఈ ప్రపంచాన్ని స్వర్గముగా తయారుచేయాలి.

2. సేవలో ఎప్పుడూ అలసిపోకూడదు. స్థూల సేవతోపాటు ఆత్మిక సేవను కూడా చేయాలి. మన్మనాభవ మంత్రాన్ని అందరికీ గుర్తు తెప్పించాలి.

వరదానము:- తండ్రి సమానముగా ప్రతి ఆత్మ పట్ల కృప మరియు దయను చూపించే మాస్టర్ దయార్ద్ర హృదయ భవ

ఏ విధంగా తండ్రి దయార్ద్ర హృదయులో, అలా పిల్లలైన మీరు కూడా అందరిపై కృప మరియు దయను చూపిస్తారు ఎందుకంటే తండ్రి సమానముగా నిమిత్తులుగా అయి ఉన్నారు. బ్రాహ్మణ ఆత్మకు ఎప్పుడూ ఏ ఆత్మ పట్ల ద్వేషము రాకూడదు. వారు కంసుడైనా, జరాసంధుడైనా లేక రావణుడైనా, ఎవరైనా కానీ,

దయార్ద్ర హృదయుడైన తండ్రి పిల్లలు ద్వేషించరు. పరివర్తనా భావనను, కళ్యాణ భావనను ఉంచుతారు ఎందుకంటే ఎంతైనా వారు మన పరివారము, పరవశులై ఉన్నారు, పరవశులై ఉన్న వారి పట్ల ద్వేషము కలగదు.

స్లోగన్:- మాస్టర్ జ్ఞానసూర్యులుగా అయ్యి శక్తుల రూపీ కిరణాల ద్వారా బలహీనతల రూపీ చెత్తను భస్మము చేయండి.